క్లుప్తంగా

భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామని ఈఓ కె.రమేష్‌నాయుడు అన్నారు. ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్ నిర్మాణాలతో పాటు పలు ప్రదేశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయం వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో దుకాణాలు కోల్పోయిన వారికి త్వరలో నూతన దుకాణాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి



నందిగామ: విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, అందిస్తున్న ఆహారం, హాస్టల్ పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ కమిషనర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్, సెక్రటరీ ఎస్. సత్యనారాయణ శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవస్థానంలో శనివారం నుంచి ప్రారంభమయ్యే శాకంబరీదేవి ఉత్సవాల ఏర్పాట్లపై కమిషనర్‌కు ఈవో భ్రమరాంబ వివరించారు. అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లు , భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలు, మూడు రోజులు అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల రద్దీ గురించి వివరించగా, కమిషనర్ పలు సూచనలు చేశారు. ఈవో వెంట దుర్గగుడి స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ, డీఈవో గురుప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పని చేయగలిగిన వారే ఉండండి

- వారం గడువు ఇస్తాం.. మార్పు లేకుంటే డీఎంఏకు సరెండర్ చేస్తాం
- కౌన్సిల్ అత్యవసర సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు

జగ్గయ్యపేటఅర్బన్: పనిచేయకుండా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి బయటకు వెళ్లిపోతూ జీతం తీసుకుంటున్న మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది తమకు అవసరం లేదని, వారి పనితీరు మారకుంటే వారిపై డీఎంఏ, కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. పాలకవర్గ సభ్యుడు కొలగాని రాము మాట్లాడుతూ తన వార్డు మ్యాపింగ్‌లో 2 వ వార్డు అని చూపిస్తుందని, ఓట్లన్నీ 6 వ వార్డులో ఉన్నాయని, కౌన్సిల్ ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వలన ఇంతవరకు తమ వార్డు హద్దులు తనకే తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది వ్యవహారం అధ్వానంగా ఉందని, సీసీ కెమెరాల్లో చూస్తున్నామని, వీరిపై డీఎంఏకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఒక ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు ఉన్నాయని, అధికారులుగా ఉన్న వారు ఒక కాగితంపై సంతకం చేయడానికి నాలుగైదు రోజులు సమయం తీసుకుంటున్నారన్నారు. ఇలాంటి వారి వలన మొత్తం కౌన్సిల్‌కు చెడ్డపేరు వస్తోందని, సిబ్బంది అంతా సహకరిస్తేనే తాము పట్టణాన్ని అభివృద్ధి చేసి కౌన్సిల్‌కు మంచిపేరు తీసుకురాగలుగుతామన్నారు. స్టాఫ్ మూవ్‌మెంట్ రిజిస్టర్ ఎందుకు మెయిన్‌టెయిన్ చేయడంలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. పనిచేయని వారిని ఉపేక్షించవద్దని, వారు మనకు అవసరం లేదని, వారిని వెంటనే డీఎంఏకు సరెండర్ చేయాలని కమిషనర్‌కు సూచించారు. ఒక వారం రోజులు సమయం ఇస్తున్నామని, అయినప్పటికీ వారి పనితీరులో మార్పు రాకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 10.30 గంటల తరువాత కార్యాలయానికి తాళం వేయాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వీడాలి

పట్టణంలో పారిశుద్ధ్యం విషయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో విఫలమవుతున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతమంది సిబ్బంది ఉండి, లక్షలాది రూపాయలు ఖర్చుపెడుతున్నప్పటికీ ఏ వార్డులో చూసినా ఫిర్యాదులే వస్తున్నాయని తెలిపారు. వార్డుల్లో ప్రజలు అడుగుతుంటే చెప్పలేకపోతున్నామని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా, చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదులు రాకుండా చూసుకుంటామన్నారు. పారిశుద్ధ్య కార్మికుల్లో 60 ఏళ్లు దాటిన వారిని తొలగించి పనిచేయగలిగే కొత్తవారికి అవకాశం కల్పించాలని కౌన్సిలర్ వట్టెం మనోహర్ విజ్ఞప్తిచేశారు. గృహాల మధ్య ఖాళీ స్థలాల వలన వర్షాకాలం అంటువ్యాధులు ప్రబలే పరిస్థితులు ఏర్పడుతున్నందున స్థలాల యజమానులపై చర్యలు తీసుకునేందుకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. 30 వ వార్డు కౌన్సిలర్ పందుల రోశయ్య మాట్లాడుతూ ఎర్రకాలువ సమస్యను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని పదే పదే కౌన్సిల్ దృష్టికి తీసుకువస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, పరిస్థితి ఇలాగే ఉంటే తమ ఆధ్వర్యంలో ఆ స్థలంలో పేదలు గుడిసెలు వేసుకుంటారని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ షేక్ హాఫీజున్నీసా, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, సుందరమ్మ, వెంకట్, ఇర్రి నరసింహారావు, కంచేటి గీతారాణి, కర్ల శాంతకుమారి, అలేఖ్య, సంధ్యారాణి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, ప్రతిపక్ష సభ్యురాలు కన్నెబోయిన రామలక్ష్మి పలు సమస్యలను ప్రస్తావించారు. అనంతరం అజెండాలోని 73 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన అందించిన సీఎం జగన్

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వెల్లంకి గ్రామంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వెల్లంకి(వీరులపాడు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విశ్వసనీయమైన, పారదర్శక పాలన అందించారని నందిగామ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్క వర్గానికో కాకుండా అన్ని వర్గాలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో తాము ప్రజల ముందుకు సగర్వంగా వెళ్తున్నామని తెలిపారు. ప్రజలకు నిరంతరం మంచి చేయాలనే తపనతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి పూర్తి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ హుసేన్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, నరేందర్ రెడ్డి, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణం తీసుకున్న ప్రతి మహిళ జీవనోపాధి మెరుగుపడాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు



సమావేశంలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, పక్కన డీపీఎంలు

పెనుగంచిప్రోలు: డ్వాక్రా సంఘాల ద్వారా రుణం తీసుకున్న ప్రతి మహిళ జీవనోపాధి మెరుగు పడాలనేది ప్రభుత్వ ఉద్దేశమని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షురాలు కాకాని పద్మ ఆధ్యక్షతన గ్రామాఖ్య సంఘాల అధ్యక్షులు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విస్సన్నపేట, కంచికచర్లలో మహిళా మార్టులు అద్భుతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో పెనుగంచిప్రోలు, విజయవాడ ప్రాంతంలో మహిళా మార్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తగా ఇవ్వనున్న పాట్టేళ్ల యూనిట్ ధర రూ.లక్షకు పెంచామన్నారు. దీంతో యూనిట్‌కు 10 నుంచి 12 పాట్టేళ్లు వస్తాయన్నారు. 6 నెలలు పెరిగితే లబ్ధిదారులకు రెట్టింపు ఆదాయం వస్తుందన్నారు. పొట్టేళ్లతో పాటు మెడికల్ కిట్, ప్రభుత్వం ఇచ్చే ట్యాగ్‌లు వేస్తారన్నారు. గతంలో తీసుకున్న పొట్టేళ్లు చనిపోయాయని చెప్పగా, ఇన్సూరెన్స్ చేస్తే వెంటనే కొత్తవి ఇస్తారన్నారు. కార్యక్రమంలో చేయూత డీపీఎం శోభారాణి, ఐబీ డీపీఎం పావని జ్యోతి, ఆసరా డీపీఎం సునీతలక్ష్మి, ఏసీ సహాయరాజు, ఏపీఎం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వయం సమృద్ధికి తోడ్పాటు

ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్



నందిగామలో మెప్మా మార్కెట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: మహిళల ఆర్థిక స్వయం సమృద్ధి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాలు అమలు చేస్తున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. నందిగామ గాంధీ సెంటర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెప్మా మార్కెట్‌ను శుక్రవారం ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ డాక్టర్ జయరాం, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎస్.మురళి, ఉలవలపూడి నరేంద్ర, సముద్రాల మధు, మెప్మా సీఓ సత్యవతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

ఎంఈఓ బాలాజీ



ఇందిరాకాలనీ ఎంపీపీ స్కూల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలాజీ

కంచికచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని, జగనన్న విద్యా కానుక కిట్లు ప్రతి విద్యార్థికి అందజేయాలని ఎంఈఓ బి.బాలాజీ అన్నారు. స్థానిక ఇందిరాకాలనీ, డీవీఆర్ కాలనీ ఎంపీపీ స్కూళ్లతో పాటు మండలంలోని గొట్టుముక్కల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరుశాతం పెంచేలా చూడాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందజేసే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మందా సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేదాద్రి నృసింహుని పవిత్రోత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు ఈ నెల 1 నుంచి 4 వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈవో హేమలతాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1న అంకురార్పణ, వాస్తుపూజ, హోమాలు, 2న పంచగవ్యప్రాశన, అగ్నిధ్యానములు, ప్రధాన హోమాలు, 3న పుణ్యాహవాచనం, పవిత్ర ఆరోహణ, అగ్నిధ్యాన ఆరాధనలు, 4న పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, స్వామి వారి శాంతి కల్యాణం వంటి కార్యక్రమాలు ఆలయ అర్చకులు వేదాంతం వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

దేశంలోనే వినూత్న పథకం జగనన్న సురక్ష

ప్రభుత్వ విప్ ఉదయభాను



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు ప్రభుత్వ పథకాలు, సహాయం అందని వారి కోసం దేశంలో ఎన్నడూ ఎక్కడా చూడని వినూత్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నాడని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను చేరువ చేస్తూ ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు గతంలో ఏ ధ్రువపత్రాల కోసమైతే ఇబ్బందులు పడ్డారో వాటికి ఎటువంటి యూజర్ చార్జీలు జగనన్న సురక్షతో పూర్తి పరిష్కారం లభించేలా చేస్తున్నారని చెప్పారు. జూలై 1 నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా నెల రోజుల పాటు సచివాలయాల వద్ద నిర్వహించే కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు హాజరవుతారని, అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జగనన్న సురక్ష నియోజకవర్గ షెడ్యూల్ బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, బద్దూనాయక్, కౌన్సిలర్లు కొలగాని రాము, తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, కాటగాని నరసింహారావు, కోఆప్షన్ సభ్యులు సాయి చైతన్యశర్మ, ఖాదర్‌బాబు, పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్ శామ్యూల్, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

జగ్గయ్యపేట: మండలంలో శనివారం నుంచి జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. 20 గ్రామ సచివాలయాల్లో ఈ నెల 1 నుంచి 25 వరకు శిబిరాలు జరుగుతాయన్నారు. తహసీల్దార్, ఈవోపీఆర్డీలు రెండు బృందాలుగా ఏర్పడి ఆయా సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఈ నెల 1న బూదవాడ, గౌరవరం, 4న అనుమంచిపల్లి, గండ్రాయి-1, 6 న అన్నవరం, గండ్రాయి-2, 11న చిల్లకల్లు, జయంతిపురం, 13న బలుసుపాడు, కె.అగ్రహారం, 15న బండిపాలెం, మల్కాపురం, 18న తక్కెళ్ళపాడు, ముక్త్యాల, 20న తిరుమలగిరి, పోచంపల్లి, 22న వేదాద్రి, షేర్‌మహ్మద్‌పేట-1, 25న ధర్మవరప్పాడుతండా, షేర్‌మహ్మద్‌పేట-2 గ్రామాల్లో క్యాంపులు జరుగుతాయన్నారు.

సీఎస్ఐ చర్చి ప్రారంభం

కేతవీరునిపాడు(నందిగామ టౌన్): క్రీస్తు కరుణామయుడని ఆయన బోధనల ప్రకారం నడుచుకుంటే ఏ కొదువా ఉండదని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో సీఎస్ఐ అధ్యక్ష ఖండ పీఠాధిపతి రెవరెండ్ జార్జి కార్నేలియస్‌తో కలసి ఎమ్మెల్యే నూతనంగా నిర్మించిన పరిశుద్ధ పౌలు సీఎస్ఐ దేవాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు 10 వేల మందికి అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ, సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

చిల్లకల్లు ఎస్ఐగా కృష్ణబాబు బాధ్యతల స్వీకరణ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): చిల్లకల్లు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా వడ్రంగి కృష్ణబాబు శుక్రువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న కందుల దుర్గాప్రసాద్ గత నెలలో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అప్పటినుంచి స్టేషన్ ఏఎస్ఐ ఇన్‌చార్జ్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ కృష్ణలంక ఎస్ఐగా పనిచేస్తున్న కృష్ణబాబును చిల్లకల్లు ఎస్ఐగా నియమిస్తూ విజయవాడ సీపీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన కృష్ణబాబు సాక్షితో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.